సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 16 । మార్చి । 2023



తస్మాత్ జాగ్రత్త

భారతీయ స్టేట్ బ్యాంక్ వినియోదారులపై సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ముఖ్యంగా ఎస్‌బీఐ యోనో యాప్ వాడుతున్న వారిని టార్గెట్ చేస్తు న్నారు. - 8లో



20 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

విజయనగరం రెల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. - 8లో



దూరమైన దాహం కేకలు..!

దాహం తీర్చే దారిదొరికింది. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరమ్మతులకు గురైన బోర్లు, తాగునీటి పథకాలను యుద్ధప్రాతిపదికన బాగుచేయిస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

పులిదాడిలో ఆవుమృతి



పులిదాడిలో మృతిచెందిన ఆవు

మెంటాడ: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సమీపంలో బుధవారం గజంగుడ్డివలస గ్రామ రైతు బొబ్బాది బుదరయ్యకు చెందిన ఆవుపై పులి పంజా విసిరింది. కళ్లాంలో కట్టిన ఆవును హతమార్చింది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ మెంటాడ బీట్ అధికారి కె.వి.ఎస్.రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పులిపాదముద్రలుగా నిర్ధారించారు. పులిదాడి చేసిన ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. స్థానికులను అప్రమత్తం చేస్తూ దండోరా వేయించారు.

నేడు మద్యం దుకాణాలు బంద్

పార్వతీపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం జరగనున్న దృష్ట్యా జిల్లాలోని మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లెక్కింపు పూర్తి అయినంత వరకు మూసివేత కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ముగిసిన ఖోఖో శిక్షణ శిబిరం



స్పోర్ట్స్‌మీట్‌కు సిద్ధమైన ఏపీ పోలీస్ ఖోఖో జట్టు

విజయనగరం: ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 21 నుంచి జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనబోయే ఏపీ పోలీస్ ఖోఖో జట్టు శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. కొద్దిరోజులుగా నగరంలోని రాజీవ్ స్టేడియం, కార్పొరేషన్ కస్పా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కోచ్ పీఎల్‌పీ కుమార్ నేతృత్వంలో జట్టు సభ్యులంతా శిక్షణ పొందారు. చివరి రోజు బుధవారం కస్పా ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని కబడ్డీ, ఖోఖో పితామహుడు స్వర్గీయ భగవాన్‌దాస్ మాస్టారు విగ్రహానికి అంజలి ఘటించారు.

18న ఇంటర్వ్యూలు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ స్పెషాలటీ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పోస్టులకు ఈ నెల 18న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

17 నుంచి అగ్నివీర్ వాయు రిజిస్ట్రేషన్

- సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ పిలుపు

విజయనగరం: అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ పిలుపునిచ్చారు. అగ్నివీర్ వాయు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 17 నుంచి ప్రారంభం కానుందని బుధవారం తెలిపారు. అగ్నివీర్ వాయు పరీక్ష ద్వారా ఎయిర్ ఫోర్స్‌లో చేరేందుకు సువర్ణావకాశమంగా పేర్కొన్నారు. 17 నుంచి 31వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 2002 డిసెంబర్ 26 నుంచి 2006 జూన్ 26 మధ్యలో జన్మించిన స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కేవలం అవివాహిత యువతీ, యువకులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో నెగ్గిన వారికి మే 20వ తేదీ నుంచి ఆన్‌లైన్ పరీక్షలు ఉంటాయని వివరించారు. ఇంటర్ విద్యార్హత ఉండాలని, మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు లేదా మూడు సంవత్సరాల డిప్లమో ఇంజినీరింగ్, రెండేళ్ల ఒకేషనల్ కోర్సులు చదివిన యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పట్టభద్రుల.. పీఠం ఎవరిదో?



స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ ఏర్పాట్లు

- నేడు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్‌కు 28 టేబుళ్ల ఏర్పాటు
- ఎన్నికల బరిలో 37 మంది అభ్యర్థులు
- పోలైన ఓట్లు 2,00,926
- లెక్కింపు సిబ్బంది 560 మంది
- మొదటి ప్రాధాన్యత ఓటుతో ఫలితం వస్తే ఆనందమే
- లేదంటే రెండు రోజుల పాటు కౌంటింగ్ జరిగే అవకాశం

పట్టభద్రుల తరపున చట్టసభలో ఉత్తరాంధ్ర నుంచి ప్రాతినిధ్యం వహించనున్న నాయకుడెవరో తేల్చే సమయం ఆసన్నమైంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించనున్నారు. 37 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 1,119 బ్యాలెట్ బాక్సుల్లో 2,00,926 మంది నిక్షిప్తం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో లెక్క తేలితే.. 36 గంటల్లోపే ఫలితం వెలువడే అవకాశం ఉంది. లేదంటే 48 గంటల సమయం దాటనుంది. ఇందుకు తగినట్లుగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సాక్షి, విశాఖపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం 8 గంటలకు మొదలవుతుంది. తుది ఫలితం తేలటానికి సుదీర్ఘ సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. తొలి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు గురువారం అర్ధరాత్రికి పూర్తవుతుందని అంచనా. ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులు, సిబ్బందికి షిఫ్టులవారీగా విధులు కేటాయించారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద 6 జిల్లాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ముందుగా ఎన్నికల అబ్జర్వర్ సిద్ధార్థజైన్, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ఏఆర్‌వోగా వ్యవహరిస్తున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, 6 జిల్లాల డీఆర్‌వోలు, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్‌లకు వేసిన సీళ్లను ఓపెన్ చేస్తారు. ర్యాండమ్‌గా బ్యాలెట్ బాక్సులను ఎంపిక చేసి, తెరవనున్నారు. ఇప్పటికే దీనిపై సిబ్బందికి రెండు విడతల శిక్షణ పూర్తి చేశారు. మొత్తం 28 టేబుల్స్‌ను లెక్కింపునకు ఏర్పాటు చేశారు. 560 మంది సిబ్బందిని నియమించగా.. వీరికి ఒక్కో షిఫ్టుకు 280 మంది చొప్పున విధులను కేటాయించారు. వీరితో పాటు సహాయకులుగా మరో 50 మందికి పైగా సిబ్బంది, అధికారులు కౌంటింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ఇప్పటివరకు 280 మంది ఏజెంట్లకు పాస్‌లు జారీచేశారు.

కౌంటింగ్ భిన్నం.. అందుకే ఆలస్యం

సాధారణ ఎన్నికల కౌంటింగ్‌లో రౌండ్లవారీగా ఓట్ల లెక్కింపు ఉంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో ప్రాధాన్యత అంకెల ప్రాతిపదికన రౌండ్లు ఉంటాయి. ఒకటో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయితే మొదటి రౌండ్ పూర్తయినట్టు పరిగణిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత ఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు కావాల్సిన కోటా ఓట్లు ఎన్ని అనేది తెలుస్తుంది. తొలి రౌండ్‌లో మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎవరికెన్ని వచ్చాయనేది నిర్ధారిస్తారు. చెల్లని ఓట్లను పక్కన పడేస్తారు. చెల్లిన వాటిలో 50 శాతం ఓట్లకు ఒకటి కలిపితే ఎన్ని ఓట్లవుతాయో.. దాన్నే కోటా(అభ్యర్థి గెలుపునకు కావాల్సిన ఓట్లు)గా నిర్ధారిస్తారు. మొత్తం 2,00,926 ఓట్లు పోలయ్యాయి. ఇందులో చెల్లని ఓట్లుపోగా మిగిలిన వాటిలో 50 శాతానికి, ఒక ఓటును అదనంగా కలుపుతారు. ఆ లెక్క మేరకు ఎవరికైతే అన్ని ఓట్లు వస్తాయో వారిని విజేతగా నిర్ణయిస్తారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లలో ఆ సంఖ్యకు ఎవరూ చేరుకోకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. అపుడు బరిలో ఉన్న 37 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ చేసి.. ఆ వ్యక్తికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను గణిస్తారు. ఈ విధంగా కోటా ఓట్లు వచ్చే వరకు అతి తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఎలిమినేట్ చేస్తూ.. లెక్కింపును కొనసాగిస్తారు.

చివరికి ఇద్దరు అభ్యర్థులు మిగిలే వరకు కోటా ఓట్లను చేరుకోకపోతే.. అపుడు ఆ ఇద్దరిలో ఎవరికి ఎక్కువ ఓట్లు వచ్చాయో.. వారినే విజేతగా ప్రకటించి, కౌంటింగ్ నిలుపుదల చేస్తారు. ఈ కారణంగా ఫలితం వచ్చే సరికి చాలా ఆలస్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఓట్ల లెక్కింపు ఇలా..

లెక్కింపు ప్రక్రియలో మొదటగా 756 పోస్టల్ బ్యాలెట్లను ఓపెన్ చేస్తారు. అందులో చెల్లని ఓట్లను మినహాయించి, మిగిలిన వాటిని బ్యాలెట్ బాక్సుల్లో కలిపేస్తారు. బ్యాలెట్ బాక్సుల నుంచి మొదట 25 చొప్పున బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కడతారు. వాటిని తెరిచి, చెల్లనివి, చెల్లుబాటయ్యే ఓట్లను రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో వేరుచేస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లను అభ్యర్థుల వారీగా లెక్కిస్తారు. ఈ ప్రక్రియ బ్యాచ్‌ల వారీగా జరుగుతుంది.

మాక్ కౌంటింగ్ నిర్వహణ



స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మాక్ కౌంటింగ్

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం స్టేడియంలో ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు, కౌంటింగ్ సిబ్బందికి రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ మాక్ కౌంటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతం



సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

- తొలిరోజు 24,389 మంది హాజరు
- మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరు డీబార్
- ఆర్ఐఓ ఎం.సత్యనారాయణ



రూమ్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు



వడివడిగా పరీక్ష కేంద్రానికి...

పార్వతీపురంటౌన్/సీతానగరం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో తొలిరోజు సెకెండ్ లాంగ్వేజ్ పేపర్-1 పరీక్షకు 19,880 మంది విద్యార్థులకు 19,140 మంది హాజరయ్యారు. 740 మంది గైర్హాజరైనట్టు ఆర్ఐఓ మజ్జి సత్యనారాయణ తెలిపారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 5,945 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 5,249 మంది హాజరయ్యారు. 696 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్షను మొత్తం 24,389 మంది రాశారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్టు ఆయన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. సదుపాయాలపై ఆరా తీశారు. ఆర్ఐఓ రెండు పరీక్ష కేంద్రాలను, డీఈసీ కమిటీ 8, స్క్వాడ్ బృందాలు 41 కేంద్రాలను తనిఖీ చేశాయి.



తల్లి సాయంతో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థిని

కోటమ్మ ఆదాయం రూ.6,75,329

శృంగవరపుకోట: భక్తుల కొంగు బంగారం, కొట్టాం గ్రామదేవత కోటమ్మ అమ్మవారి హుండీల ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారులు బుధవారం లెక్కించారు. రూ.6,75,329ల నగదు, 4 గ్రాముల బంగారం, 398 గ్రాముల వెండి వచ్చినట్టు ఈఓలు కె.నాగేంద్ర, ఎం.ప్రసాద్ తెలిపారు.



కోటమ్మ హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

మన్యంలో ఐదు నైపుణ్య శిక్షణ కేంద్రాలు

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో ఐదు నైపుణ్యశిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సాలూరు ప్రభుత్వ ఐటీఐ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పార్వతీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్, సీతంపేట ఐటీఐలో నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ వివరాలను ప్రకటించారు.

- గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్, సూయింగ్ మిషన్ ఆపరేటర్ కోర్సులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తారు. ఈ కోర్సులకు 8వ తరగతి నుంచి డిగ్రీ చదువుకున్న అభ్యర్థులు అర్హులు. వివరాలకు సెల్: 63034 93720, 89788 78557 నంబర్లను సంప్రదించాలి.
- సాలూరు ప్రభుత్వ ఐటిఐలో ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన యువకులకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్ కోర్సులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు సెల్: 94947 77553, 96662 00617 నంబర్లను సంప్రదించి కోర్సులలో చేరవచ్చు.
- సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులకు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎమ్‌కామ్ చదువుకున్న యువతీ, యువకులు అర్హులు. వివరాలకు సెల్: 85559 09899, 63051 10947 నంబర్లను సంప్రదించి కోర్సులో చేరవచ్చు.
- పార్వతీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రిటైల్ సేల్స్ అసోసియేషన్, మొబైల్ ఫోన్ అసెంబ్లింగ్ కోర్సులకు శిక్షణ ఇస్తారు. స్వయ ఉపాధిని ప్రోత్సహిస్తారు. పదవ తరగతి, డిగ్రీ చదువుకున్న వారు అర్హులు. వివరాలకు సెల్: 93818 85611, 93917 42042 నంబర్లకు సంప్రదించాలి.
- సీతంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులను నిర్వహిస్తున్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో పూర్తిచేసిన యువకులు అర్హులు. వివరాలకు సెల్:70320 60773, 95024 07824 నంబర్లను సంప్రదించాలి.



జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం



జిల్లాలో నవధాన్యాల సాగు



- విస్తృతంగా అవగాహన సదస్సులు
- ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులే లక్ష్యం
- జిల్లాలో 400 డ్వాక్రా గ్రూపుల ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ
- జిల్లాలో 41,225 ఎకరాల్లో నవధాన్యాల సాగు
- ప్రకృతి వ్యవసాయంలో 39,330 వేల మంది రైతులు

పార్వతీపురంటౌన్: ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశమున్న ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తోంది. భూసారం పెంచుకునేందుకు వీలుగా రైతులకు రాయితీపై పచ్చిరొట్ట, నవధాన్యాల విత్తనాలను సరఫరా చేస్తోంది. సాగు పద్ధతులపై ఊరూరా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, ఆర్‌బీకే సిబ్బందితో అవగాహన కల్పిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులతో పాటు రైతులకు అధిక ఆదాయం వచ్చేలా సాగుప్రణాళికను అమలుచేస్తోంది.

విత్తనాల పంపిణీ..

భూ సారంపైనే పంట ఏపిక, దిగుబడులు ఆధారపడి ఉంటాయి. అందుకే.. ప్రధాన పంట సాగుకు ముందు పచ్చిరొట్ట, నవధాన్యాల విత్తనాలను జల్లి 30-40 రోజుల మధ్య భూమిలో కలియదున్నితే చాలు.. భూమికి కావాల్సిన పోషకాలు సమకూరుతాయి. ఏ పంట సాగుచేసినా ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎరువులు, పురుగు మందుల వినియోగం 50 శాతానికి పైగా తగ్గుతుందని, పంటకు చీడపీడలు ఆశించవని రైతులకు హితబోధ చేస్తున్నారు. మండలాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా నవధాన్యాల ప్యాకెట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. 11 కిలోల ప్యాకెట్‌ను రూ.వెయ్యికి అందజేస్తున్నారు. ఇలా తయారు చేసేందుకు ఈ గ్రూపులకు బ్యాంకు లింకేజ్ ద్వారా ప్రభుత్వం రుణసదుపాయాన్ని కల్పిస్తోంది. ఒక్కో గ్రూపుకు రూ.50 వేలు రుణం అందిస్తోంది. జిల్లాలోని 15 మండలాల్లో ప్యాకింగ్ ద్వారా గ్రూపులు కొంత ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో 41,225 ఎకరాల్లో నవధాన్యాల సాగు లక్ష్యంగా జీరో కాస్ట్ అగ్రికల్చర్ విధానాన్ని అవలంబిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 39,330 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. మరింత మంది రైతులను ప్రకృతిసాగువైపు అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

మరింత విస్తరణకు కృషి

ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న జీరోకాస్ట్ అగ్రికల్చర్ విధానాన్ని త్వరలోనే ఆర్బీకేల పరిధిలోకి తీసుకురానున్నారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులు తయారు చేసిన నవధాన్యాల విత్తన ప్యాకెట్లను ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతి (పీఎండీఎస్) పథకం కింద ఆర్బీకేల ద్వారా రైతులకు విక్రయిస్తారు. తద్వారా ప్రకృతి సాగును క్షేత్రస్థాయిలో విస్తరిస్తారు. మరోవైపు నవధాన్యాలు విత్తడం, దుక్కిచేయడం, వాటివల్ల కలిగే ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన గడపగడపకు నవధాన్యాల సారథులు రైతుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు.

రైతులకు ఉపయోగకరం



జీరో కాస్ట్ అగ్రికల్చర్ విధానాన్ని అవలంబించడం ద్వారా భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. సాగు ఖర్చులు తగ్గుతాయి. భావితరాల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు. ఈ నెలాఖరుకు విత్తన కిట్లను రైతులకు అందుబాటులోకి తెస్తాం.

– షణ్ముఖ రాజు, ప్రకృతివ్యవసాయం జిల్లాఅధికారి, పార్వతీపురం మన్యం

సాగులో మమేకం..



డ్వాక్రా సభ్యులమే అయినా రైతులమే. సాగుపై మాకు పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. ఇప్పుడు నవధాన్యాల విత్తనాల సరఫరా బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. దీనివల్ల రైతులను ప్రోత్సహించడంతో పాటు డ్వాక్రాగ్రూపు సభ్యులకు ఆర్థిక పుష్టి కలుగుతోంది. విత్తన ప్యాకెట్లను ఆర్బీకేలకు సరఫరా చేస్తున్నాం.

– పెద్దంటి సరస్వతి, పొదుపు సంఘం, పెద్దబొండపల్లి గ్రామం

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదవతరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ విద్యాశాఖాధికారులకు సూచించారు. పార్వతీపురం ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం విద్యాసంబంధిత అంశాలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలని ఆదేశించారు. సులభతర పద్ధతుల్లో పాఠ్యాంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరంలో బడివయసు పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలన్నారు. జగనన్న గోరు ముద్ద కింద విద్యార్థులకు సంపూర్ణ పోషణ అందాలని, బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రక్త హీనతతో బాధపడే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద వర్గాలకు కేటాయింపుపై విధిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాలల్లో బైజూస్ బోధన పరిశీలించాలని, విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యాబోధన సాగించాలని సూచించారు. నాడు- నేడు పనులపై దృష్టి సారించాలని, సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎస్‌డీవీ రమణ, డిప్యూటీ ఈఓ పి.బ్రహ్మజీరావు, టీపీఎంయూ ఏపీడీ వై.సత్యం నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పైడితల్లికి మార్వాడీల చల్లదనం


అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న మార్వాడీలు

విజయనగరం టౌన్‌: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి మార్వాడీలు బుధవారం చల్లదనం కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన పిండివంటలను నైవేద్యంగా సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మార్వాడీలు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

కొమరాడ: మండలంలోని గుణానుపురం గ్రామానికి చెందిన పాట్నూరు సతీష్‌ నిల్వ ఉంచిన 11 బస్తాల పీడీఎస్‌ బియ్యం బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారి హరి రమణరావు చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామల్లో పీడీఎస్‌ రైస్‌ నిల్వలను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు నిఘా పెంచామన్నారు పట్టుబడిన బియ్యం స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిపై 6ఎ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

అదుపు తప్పి ద్విచక్రవాహనం బోల్తా


ప్రమాదంలో గాయపడిన జగదీష్‌

కొత్తవలస: మండలంలోని అరకు-విశాఖ జాతీయ రహదారిలో గాంధీనగర్‌ సమీపంలో బుధవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బొల్తాపడింది. ఈ ప్రమాదంలో విశాఖపట్నం జిల్లా గాజువాక సమీపంలో గల అక్కిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన బలిరెడ్డి జగదీష్‌ తీవ్ర గాయాల పాలయాడు. క్షతగాత్రుడు తన అత్తవారి గ్రామం వేపాడ మండలం బొద్దాం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. జగదీష్‌ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి 108 వాహనంలో కొత్తవలస పీహెచ్‌సీకి తరలించగా ప్రథమచికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం వైద్యులు విశాఖపట్నం రిఫర్‌ చేశారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు


బొబ్బిలి సీహెచ్‌సీలో క్షతగాత్రులు

బొబ్బిలి: పట్టణంలోని జూట్‌మిల్లు సమీపంలో బుధవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మక్కువ మండలం వెంకట్రాయుడిపేటకు చెందిన బోదెల లక్ష్మణ రావు పార్వతీపురంనుంచి బొబ్బిలి వస్తున్నారు. అదే సమయంలో పట్టణానికి చెందిన కోట రామకృష్ణ స్వామివారి వీధి వద్ద మలుపు తిరుగుతుండగా ఇద్దరూ పరస్పరం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి కోట రామకృష్ణను మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం..

- జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఈశ్వర్‌ కౌశిక్‌


ఈశ్వర్‌ కౌశిక్‌ను కలిసిన నాగరాజు

విజయనగరం: క్రీడలు, క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ అధ్యక్షుడు, వైఎస్సార్‌ సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్‌ కౌశిక్‌ అన్నారు. రేగిడి మండలం ఉణుకూరుకు చెందిన పర్వతారోహకుడు మెరుగుల నాగరాజు జిల్లా కేంద్రంలో ఈశ్వర్‌కౌశిక్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కౌశిక్‌ మాట్లాడుతూ, నాగరాజు గతంలో ఆఫ్రికా ఖండంలోని టాంజానియలో 5,985 మీటర్ల ఎత్తు గల కిలిమంజారో పర్వతాన్ని కేవలం ఏడు రోజుల్లో అధిరోహించాడన్నారు. అలాగే సిక్కింలో 5,450 మీటర్ల ఎత్తు గల లఖోఖాన్‌సే పర్వతాన్ని అధిరోహించి, ఆ రాష్ట్ర ప్రభుత్వం బంగారు పతకంతో పాటు ఉత్తమ అధిరోహకుడు, ఉత్తమ మారథాన్‌ పురస్కారాన్ని కూడా అందుకున్నారన్నారు. ఎవరెస్ట్‌ అధిరోహణ లక్ష్యంగా చేసుకున్న నాగరాజుకు ఆర్థిక సాయంతో పాటు, అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

యోనో యూజర్లు.. తస్మాత్‌ జాగ్రత్త

- ఎటువంటి మెసేజ్‌లకూ స్పందించవద్దు
- అకౌంట్‌ బ్లాక్‌ అవుతుందని సైబర్‌ నేరగాళ్ల సందేశాలు
- అప్‌డేట్‌ చేసుకోవాలంటూ పంపిస్తున్న లింకులు
- డీఎస్పీ ఎ.సుభాష్‌


ఎస్బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ ఎ.సుభాష్‌

పార్వతీపురంటౌన్‌: భారతీయ స్టేట్‌ బ్యాంక్‌ వినియోదారులపై సైబర్‌ నేరగాళ్లు వల విసురుతున్నారు. ముఖ్యంగా ఎస్‌బీఐ యోనో యాప్‌ వాడుతున్న వారిని టార్గెట్‌ చేస్తున్నారని వినియోదారులు అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం డీఎస్పీ ఎ.సుభాష్‌ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయంలో స్టేట్‌ బ్యాంక్‌ మేనేజర్‌ రవిశంకర్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోనో విషయంలో వచ్చే సందేశాలపై అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. 'ప్రియమైన ఎస్‌బీఐ వినియోదారు డా! మీ ఖాతా బ్లాక్‌ అవుతుంది. పాన్‌ నంబరును అప్‌డేట్‌ చేసుకోవడానికి ఈ కింద లింక్‌ను క్లిక్‌ చేయండి' అంటూ మోసపూరిత సందేశాలను పంపుతూ ఎస్బీఐ వినియోగదారులను సైబర్‌ మోసగాళ్లు టార్గెట్‌ చేస్తున్నారని వాటిని నమ్మవద్దని స్పష్టం చేశారు. ఇటువంటి సందేశాలు, ఈమెయిల్స్‌కు స్పందించవద్దన్నారు. సైబర్‌ నేరగాళ్లు పంపే ఈ సందేశాల్లోని లింక్స్‌ ఓపెన్‌ చేస్తే ఖాతాలో డబ్బులు మాయమవుతాయని తెలిపారు. ఇటువంటి సందేశాలు వస్తే వెంటనే 'రిపోర్ట్‌.ఫిషింగ్‌ ఎట్‌ ఎస్‌బీఐ కో.ఇన్‌'లో రిపోర్ట్‌ చేయాలని ప్రజలకు సూచించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఖాతానంబర్‌, పాస్‌వర్డ్‌, ఓటీపీ సహా ఇతర సున్నిత, వ్యక్తిగత సమాచారాన్ని మెసేజ్‌ రూపంలో పంపవద్దన్నారు. సైబర్‌ నేరగాళ్లు తమ లింక్స్‌ ద్వారా ఖాతాదారుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి మోసం చేస్తారని, ఏదైనా సైబర్‌ నేరం గురించి నేరుగా ఫిర్యాదు చేయాలంటే 1930 నంబర్‌కు ఫోన్‌ చేసి చెప్పవచ్చని సూచించారు.

17వతేదీ వరకు ఈపంట సామాజిక తనిఖీ

విజయనగరం ఫోర్ట్‌: రబీసీజన్‌ 2022-23లో జిల్లాలో 1,33,387 ఎకరాల్లో 85,835 మంది రైతులకు ఈ-పంట నమోదు చేశామని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1,27,157 ఎకరాల్లో 79,395 మంది రైతులకు (95.6శాతం) ఈ-కేవైసీ పూర్తి చేశామని చెప్పారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద ఈనెల 10వతేదీన ఈ -పంట ముసాయిదా జాబితాను పెట్టామన్నారు. జిల్లావ్యాప్తంగా ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తున్న రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి ఈ-పంట ముసాయిదా జాబితా ఈనెల 13 నుంచి 17 వతేదీ వరకు సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామన్నారు. అదేవిధంగా గ్రామ సభలు కూడా నిర్వహిస్తామని, గ్రామ సభల్లో ఆర్‌బీకే సిబ్బంది జాబితాలో ఉన్న రైతుల వివరాలను చదివి వినిపిస్తారన్నారు. కావున రైతులు రైతు భరోసా కేంద్రాల పరిధిలో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించిన జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే సవరణ కోసం రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఈ-పంట రబీ 2022-23 సీజన్‌ సవరణ కోసం ఇదే ఆఖరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తరువాత ఎటువంటి మార్పులు, చేర్పులు ఉండవని స్పష్టం చేశారు.

140సారా ప్యాకెట్లతో మహిళ అరెస్టు

పాచిపెంట: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెదిన మహిళ సారా అమ్ముతూ బుధవారం పట్టుబడిందని ఎస్సై వెంకటరణ తెలిపారు. ఈ మేరకు ఆ మహిళ నుంచి 140 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వివాహిత అదృశ్యం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన తండ్రి

మెరకముడిదాం: తన కూతురు కనిపించడం లేదని, బుదరాయవలస గ్రామానికి చెందిన సరిధి రామస్వామినాయుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సరిధిగౌరి (43)ని బాడంగి మండలం రౌతోడువలస గ్రామానికి చెందిన రౌతుశ్రీనివాసరావుకు ఇచ్చి 23 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. అయితే భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు తలెత్తుతుండడంతో వారి కుమారుడైన రౌతుదినేష్‌ తల్లిని తీసుకువచ్చి మంగళవారం సాయంత్రం 4గంటల సమయంలో తాత రామస్వామినాయుడు ఇంట్లో దిగబెట్టి వెళ్లిపోయాడు. అనంతరం సాయంత్రం 6గంటలకు గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లివస్తానని చెప్పి గౌరి వెళ్లి ఇంతవరకూ తిరిగి రాకపోవడంతో రామస్వామినాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై నవీన్‌పడాల్‌ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు కృషిచేయాలి

- ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్‌


ఎస్‌ఈబీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్‌

విజయనగరం క్రైమ్‌: నేరాల నియంత్రణకు అధికారులు కృషిచేయాలని స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్‌ కోరారు. ఈ మేరకు విజయనగరం ఎస్‌ఈబీ స్టేషన్‌లో బుధవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న రికార్డులు, వాహనాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సర్కిల్‌ పరిధిలో సారా, మద్యం అమ్మకాల నియంత్రణకు చేస్తున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేయాలని సూచించారు. మహిళా పోలీసులతో స్టేషన్‌ ఆవరణలో మాట్లాడుతూ ఎస్‌ఈబీ నేరాలపై ప్రత్యేక దృష్టిసారించాలని, అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ స్టేషన్‌ హౌస్‌ ఆఫీసర్‌ మధుకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

20 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్‌ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్‌: స్థానిక రైల్వేస్టేషన్‌ పరిసర ప్రాంతంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను వన్‌టౌన్‌ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్‌ సీఐ బి.వెంకటరావు బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. వాహన తనిఖీల్లో భాగంగా విజయనగరం రైల్వేస్టేషన్‌ వద్ద మంగళవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. బుధవారం వేకువజామున ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా సీఐ, సిబ్బంది వారిని ఆపి తనిఖీ చేశారు. వారి బ్యాగుల్లో 20 కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యం కావడంతో ప్రశ్నించగా ఒడిశాలోని కొరాపుట్‌ జిల్లాకు చెందిన వారమని, డబ్బులు సంపాదించుకోవాలనే లక్ష్యంతో గంజాయిని తరలిస్తున్నామని పోలీసులకు తెలిపారు. అరెస్టయిన వారిలో కొరాపుట్‌ జిల్లా నారాయణపట్న సమితి బర్లి గ్రామానికి చెందిన ప్రమోద కుమార్‌ ఖోస్లా, అదే దమన్‌జోడికి చెందిన అవినాష్‌, తులసీ కులదీప్‌లు ఉన్నారు. సమావేశంలో వన్‌టౌన్‌ ఎస్సైలు రామ గణేష్‌, భాస్కరరావు, ఏఎస్సై మన్మథరావు, హెచ్‌సీ ఏవీ.రమణ పాల్గొన్నారు.

ఫోన్‌పే చేసినట్లు చూపించి పరారీ

విజయనగరం క్రైమ్‌: ఫోన్‌పే చేసినట్లు ఫేక్‌ మెసెజ్‌ చూపించి అమ్మకం దారు చెక్‌ చేసుకునే లోపు కొనుగోలు దారు పరారయ్యాడు. ఆర్టీసీ కాంప్లెక్స్‌ వద్ద బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. తన దగ్గరున్న మొబైల్‌ ఫోన్‌ను అమ్మేందుకు గుంకలాం గ్రామానికి చెందిన కృష్ణ ఓఎల్‌ఎక్స్‌లో రూ.లక్షా 10వేలకు సేల్‌ పెట్టాడు. విశాఖ నుంచి కొనుగోలు చేసేందుకు ఒక వ్యక్తి వచ్చి ఆర్టీసీ కాంప్లెక్స్‌ వద్ద రూ.90వేలకు బేరం కుదుర్చుకున్నాడు. మొత్తం నగదు ఫోన్‌పే చేస్తానని చెప్పి మొబైల్‌ ఫోన్‌ తీసుకున్నాడు. ఫోన్‌పే చేసినట్లు అమ్మకం దారు కృష్ణకు ఫేక్‌ మెసెజ్‌ చూపించాడు. అయితే మొబైల్‌ విక్రయించిన కృష్ణ చెక్‌ చేసుకునే లోపు విశాఖ వాసి అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితుడి ఖాతాలోకి డబ్బులు రాకపోవడంతో వెంటనే వన్‌టౌన్‌ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరావు తెలిపారు.

దూరమైన దాహం కేకలు..!

- ఏజెన్సీ గ్రామాలకు తాగునీటి సౌకర్యం
- వేసవి నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు
- గ్రామాల్లో విస్తృతంగా సర్వే
- పాడైన బోర్లు గుర్తించి మరమ్మతులు
- ముందస్తు చర్యలు చేపడుతున్న యంత్రాంగం




కారిమానుగుడలో బోరు రిపేరు చేస్తున్న సిబ్బంది


పులిగుమ్మిలో నూతన బోరు


ఇప్పగూడలో రక్షిత పథకం పైప్‌లైన్‌ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సీతంపేట: పై ఫొటోలో కనిపిస్తున్న బోరు సీతంపేట ఏజెన్సీలో కారిమానుగుడ గ్రామంలోనిది. ఇది మరమ్మతుల బారిన పడడంతో గిరిజనులు మంచి నీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉన్న దాదాపు 20 కుటుంబాలకు తాగునీటి అవస్థలు తప్పలేదు. ఇది గుర్తించిన ఆర్‌డబ్ల్యూఎస్‌ సిబ్బంది వెంటనే బోరు మరమ్మతు చేయడంతో నీరు ఇప్పుడు పుష్కలంగా వస్తోంది. అలాగే ఇప్పమానుగూడలో రక్షిత పథకం పైప్‌లైన్‌ పాడవడంతో నీటి కోసం అవస్థలు అన్నీఇన్నీ కావు. అక్కడ కూడా 40కిపైగా గిరిజన కుటుంబాలు ఉంటాయి. ఇటీవల దానిని కూడా మరమ్మతు చేయడంతో గిరిజనుల నీటి కష్టాలు తీరాయి. ఇలా చెప్పుకుంటే చాలా గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నారు. పులిగుమ్మి, అమ్మచెరువు, బంగారుగూడ తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి ఉండగా పరిష్కార చర్యలు తీసుకుంటున్నారు.

మార్చి నెల వచ్చిందంటే చాలు గ్రామాల్లో గుక్కెడు నీటి కోసం ఏటా తహతహలాడుతుంటారు. ఈ సమస్య ఇప్పటిది కాదు. దశాబ్దాల కాలంగా నీటి ఎద్దడితో గిరిజనులు అల్లాడుతున్నారు. కొండ శిఖర గ్రామాల్లో అయితే సమస్య జఠిలమైంది. ఈ కష్టాల నుంచి గట్టెక్కిండానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపడుతోంది. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తనదైన శైలిలో అన్ని సమావేశాల్లోనూ, స్పందనలోనూ అధికారులకు సామాన్యుల వలే వినతులు ఇవ్వడంతో నీటి సమస్య కొలిక్కి వస్తోంది. నూతనంగా బోర్లు కూడా గ్రామాల్లో వేస్తున్నారు.

గ్రామాల్లో విస్తృత సర్వే

గ్రామాల్లో విస్తృతంగా సర్వే చేయడానికి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చర్యలకు ఉపక్రమించారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామాన్ని సందర్శించి అక్కడ బోర్లు రిపేరైతే వెంటనే చేయనున్నారు. పైప్‌లైన్‌ ఎక్స్‌టెన్షన్‌, బోర్‌వెల్‌ డ్రిల్లింగ్‌, చేతి పంపు రిపేర్లు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఐటీడీఏ పరిధిలో ట్రైబల్‌ ప్రాజెక్టు మానిటరింగ్‌ యూనిట్‌ పరిధిలో సీతంపేట, పాతపట్నం, కొత్తూరు, మందస, మెళియాపుట్టి, భామిని, హిరమండలం మండలాలున్నాయి. వీటిలో సీతంపేట ఏజెన్సీలో అత్యధికంగా 53 గిరిజన పంచాయతీల్లో 512 గ్రామలుండగా ప్రతి సంవత్సరం 50 వరకు గిరిజన గ్రామాలు తీవ్రనీటి ఎద్దడి ఎదుర్కొంటాయి. ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు. రక్షిత మంచినీటి పథకాలు 82, బోర్లు 704 ఉన్నాయి. వాటిలో 30కిపైగా బోర్లలో వర్షాకాలంలో మాత్రమే నీరు వస్తుంది. వేసవి వస్తే పని చేయని పరిస్థితి. 20 వరకు నీటి ఎద్దడి గ్రామాలు గుర్తించినట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తెలియజేస్తున్నారు.

ప్రత్యేక చర్యలు



తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకుని బోర్లు వేయిస్తున్నాం. ఎక్కడైనా గ్రామాల్లో నీటి సమస్య ఉన్నట్లు తెలియజేసిన వెంటనే స్పందిస్తున్నాం. కలెక్టర్‌, ఐటీడీఏ పీవో, మా శాఖాధికారుల సూచనల మేరకు సర్వే చేస్తున్నాం.

పవన్‌కుమార్‌, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్‌

తీవ్రత తగ్గింది



గిరిజన గ్రామాల్లో తాగు నీటి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. ఇప్పుడు ఇంటింటికి కుళాయిలు కూడా వేశారు. గతంతో పోలిస్తే తాగునీటి ఎద్దడి తగ్గింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన గ్రామాలకు పూర్తిస్థాయిలో నీటి సౌకర్యం కల్పిస్తున్నారు. ముఖ్యంగా సోలార్‌ రక్షిత పథకాలతో పాటు చేతి పంపులు ఏర్పాటు చేస్తూ, మరమ్మతుల్లో ఉన్నవాటిని రిపేరు చేయిస్తున్నారు.

ఎస్‌.వెంకటేష్‌, ఈతమానుగూడ

నీట్‌ పీజీలో ర్యాంకుల పంట


పూజితను సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు


వంశీ


మాధురి


సాయి మాధురి


సాయి ప్రియాంక

గజపతినగరం/కొత్తవలస/వేపాడ: నీట్‌ పీజీ ఎంట్రన్స్‌లో జిల్లా విద్యార్థులు పలువురు ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన ఆయా విద్యార్థుల వివరాలిలా ఉన్నాయి. గజపతినగరానికి చెందిన పారాది లక్ష్మీపూజిత 22వ ర్యాంకు సాధించడంతో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు బుధవారం ఆమెను ఘనంగా సత్కరించారు. పూజితతో పాటు ఆమె తల్లిదండ్రులు పారాది సన్యాసిరావు, నాగమణిలను అభినందించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు జుత్తాడ చిట్టిబాబు, జవ్వాది సతీష్‌, తిరుపతిరావు, ఎ.సంతోష్‌, విశ్వనాథ్‌, కె.రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌ కుమారుడు..

కొత్తవలస మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన బొడ్డు వంశీ ఇటీవల నిర్వహించిన నీట్‌ పీజీ ఎంట్రన్స్‌లో ఆలిండియా పరిధిలో 719వ ర్యాంక్‌ సాధించాడు. తండ్రి స్వామినాయుడు ఆటో నడుపుతూ కుంటుంబాన్ని పోషిస్తుండగా తల్లి అప్పలకొండ గృహిణి. కాగా గతంలో ఎంసెట్‌లో 688వ ర్యాంక్‌ సాధించి విశాఖపట్నం ఆంధ్ర మెడికల్‌ కళాశాలలో ఎంబీబీఎస్‌ పూర్తి చేసినట్లు వంశీ తెలిపాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు వంశీకి అభినందనలు తెలిపారు. అలాగే వేపాడ గ్రామానికి చెందిన ఆదపురెడ్డి మహాలక్ష్మి మాధురి నీట్‌ పీజీ సెట్‌లో ఆలిండియా 3052 ర్యాంకు సాధించింది.

బొబ్బిలిలో..

బొబ్బిలి: నీట్‌ ఫలితాల్లో బొబ్బిలి పట్టణానికి చెందిన సింగంశెట్టి సాయిమాధురి ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో 1987వ ర్యాంక్‌ సాధించింది. ఆమె తండ్రి రిటైర్డ్‌ బ్యాంక్‌ ఉద్యోగి కాగా.. విశాఖపట్నం ఆంధ్రా మెడికల్‌ కళాశాలలో ఎంబీబీఎస్‌ చదివింది. అలాగే ఇదే పట్టణానికి చెందిన అల్లు సాయి ప్రియాంక జాతీయ స్థాయిలో 9000 ర్యాంక్‌ సాధించింది. ఈమె తండ్రి శంకరరావు విద్యుత్‌శాఖ ఈఆర్‌ఓ కార్యాలయంలో సీనియర్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయా గ్రామాల ప్రజలు అభినందించారు.

నెలాఖరులోగా భూ సర్వే పూర్తి చేయండి..

- కలెక్టర్‌ సూర్యకుమారి


రీ సర్వే వివరాలను తహసీల్దార్‌ ఆదిలక్ష్మిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్‌ సూర్యకుమారి

డెంకాడ: సమగ్ర భూముల రీసర్వేను ఈ నెలాఖరులోగా పూర్తి సేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ ఎ.సూర్యకుమారి రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గంట్లాంలో జరుగుతున్న భూముల రీసర్వేను బుధవారం పరిశీలించారు. అవసరమైన సర్వేయర్లను డిప్యూటేషన్‌పై నియమించినందున వారి సేవలు వినియోగించుకుని సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. రెండు బృందాలతో రీసర్వే చేస్తున్నట్లు తహసీల్దార్‌ పి.ఆదిలక్ష్మి కలెక్టర్‌ సూర్యకుమారికి వివరించారు. పది గ్రామాల్లో సర్వే పూర్తి చేశామని, మరో 16 గ్రామాల్లో సర్వే పూర్తికావాల్సి ఉందన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్‌ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్‌

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్‌

బ్రాయిలర్‌

లైవ్‌	డ్రెస్‌డ్‌	స్కిన్‌లెస్‌
₹110	₹190	₹ 200